## క్లుప్తంగా

### పొంచి ఉన్న ప్రమాదం


పెద్దపాడు వక్కెర వాగుపై దెబ్బతిన్న రక్షణ గోడ

**కల్లూరు:** మండల పరిధిలోని పెద్దపాడు వక్కెర వాగుపై ఉన్న బ్రిడ్జి రక్షణ గోడ కూలి ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డుపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వాహనదారులు ఆదమరిస్తే వాహనాలతో పాటు వాగులోకి పడే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడను నిర్మించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

### 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


చిన్నకొలుములపల్లిలో బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

**కోడుమూరు రూరల్:** స్థానిక సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం చిన్నకొలుముల గ్రామంలో నిర్వహిస్తున్న నాటుసారా బట్టీపై ఆదివారం సిబ్బందితో దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే కృష్ణగిరి మండలం సంగాల గ్రామంలో మధు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ అలీబేగ్, సిబ్బంది హనుమంతు, విరుపాక్షి రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

### వైభవంగా జగన్నాథ రథయాత్ర


ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు

**కర్నూలు కల్చరల్:** అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం వైభవంగా జరిగింది. భగీరథ కాంప్లెక్స్‌లోని శ్రీ పూరీ జగన్నాథ మందిరం ప్రాంగణంలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ఊరేగించారు. హరినామ సంకీర్తన, మహారాజభోగ హారతి, ఆశీర్వాదం, మహా ప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి. కర్నూలు ఇస్కాన్ బాధ్యులు రఘునందన సేవక్ ప్రభు ప్రత్యేక ప్రవచనం చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. భగవద్గీత పఠనం, శ్రవణం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

### గురుపూర్ణిమ ముఖ్యమైన వేడుక


మాట్లాడుతున్న బయ్యా వాసు

**కర్నూలు కల్చరల్:** సమాజ జీవితంలో గురుపూర్ణిమ చాలా ముఖ్యమైన పండుగ అని ఏపీ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు అన్నారు. రాష్ట్రీయ స్వయం సేవక ఆధ్వర్యంలో ఆదివారం వీఆర్ కాలనీలోని వెంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో గురుపూజోత్సవ వేడుక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన దేశంతో పాటు మొత్తం మానవ జాతికి మార్గనిర్దేశం చేసిన వేద వ్యాసుడు ప్రపంచానికి గురువు అయ్యాడన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త సోమా సుధీర్, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ చాలక్ వెంకటరెడ్డి, నగర సంఘచాలక్ డాక్టర్ చల్లా వాసురెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

### పేదలకు దుప్పట్లు, దోమతెరల పంపిణీ

**కర్నూలు(హాస్పిటల్):** నగరంలోని పలువురు పేదలకు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ ఆదివారం దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేశారు. గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, కలుషిత నీరు, దోమకాటుకు గురికాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ప్రస్తుత సీజన్‌లో నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, కలుషిత నీరు తాగడం వల్ల కలరా, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. అందుకే ప్రతి ఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని చెప్పారు.

# 26 కిలో మీటర్లు.. 46 స్పీడ్ బ్రేకర్లు

- జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరాపురం వరకు సీసీ రోడ్డు నిర్మాణం
- ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు
- కానరాని సూచిక బోర్డులు
- నిత్యం ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

మండల కేంద్రం గడివేముల నుంచి నంద్యాలకు వెళ్లాలంటే నరకమే. నడుం నొప్పులుంటే పోతాయ్.. లేకుంటే మాత్రం తప్పకుండా వస్తాయ్. ప్రమదాలను నివారించాల్సిన స్పీడ్ బ్రేకర్లే ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు మీద స్పీడ్ బ్రేకర్ ఉన్నట్లు బోర్డులు ఉండవు, రాత్రివేళలో కంటికి కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఉండవు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

**గడివేముల:** మండలంలోని బిలకలగూడూరు సమీపంలో 2007లో జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీకి చెందిన భారీ వాహనాలు నడిచేందుకు ఆర్అండ్‌బీ రహదారిని జిందాల్ యాజమాన్యం తమ అధీనంలోకి తీసుకుంది. దీంతో సింగిల్‌రోడ్డు ఉన్న రహదారిని డబుల్ రోడ్డుగా ఏర్పాటు చేసి దాదాపు 26 కిలోమీటర్ల మేర సీసీరోడ్డు నిర్మాణం పనులు చేపట్టారు. అంతవరకు బాగానే ఉంది. మండల ప్రజలు, వాహనదారులు రోడ్డు బాగా నిర్మించారని కొనియాడారు. అప్పటి నుంచే మండల ప్రజలు, వాహనదారులకు కష్టాలు ప్రారంభమయ్యాయి.

**ఆపద సమయంలో ప్రాణాలు పోవాల్సిందే**

గడివేముల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు అత్యవసర వేళల్లో ఆస్పత్రులకు వెళ్లేలోపే ప్రాణాలు పోవాల్సిన పరిస్థితి నెలకొంది. మెరుగైన వైద్యం కోసం నంద్యాలకు తీసుకెళ్లే సమయంలో ఆస్పత్రికి సమయానికి చేరుకోలేక ప్రాణాలు పోయిన సంఘటనలు ఉన్నాయి. గడివేముల నుంచి నంద్యాలకు చేరాలంటే గంట సమయానికి స్పీడ్ బ్రేకర్లు అధికంగా ఉన్న కారణంగా రెండు గంటలు పడుతోందని వాహనదారులు చెబుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి అవసరం లేని స్పీడ్ బ్రేకర్లను తొలగించి, రోడ్డుపై చీలికలకు మరమ్మతులు చేయాలని లేదా నూతనంగా రోడ్డు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


బిలకలగూడూరు - నంద్యాల రహదారిలో స్పీడ్ బ్రేకర్ల వద్ద కానరాని సూచికలు

**స్పీడ్ బ్రేకర్ల వద్ద సూచికలు లేవు**

జిందాల్ యాజమాన్యం నంద్యాలలోని వెంకటేశ్వరపురం వరకు నిర్మించిన సీసీ రోడ్డులో ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. గడివేముల నుంచి వెంకటేశ్వరపురం వరకు సుమారు 26 కిలోమీటర్లకు 46 స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడం గమనార్హం. స్పీడ్ బ్రేకర్ల వద్ద సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మరణించిన సంఘటనలు అనేకం.


గడిగరేవుల గ్రామం వద్ద సీసీ రోడ్డుపై ఏర్పడిన పగుళ్లు

**సీసీ రోడ్డుకు పగుళ్లు**

జిందాల్ ఫ్యాక్టరీ నుంచి వెంకటేశ్వరపురం వరకు నిర్మించిన సీసీ రోడ్డులో పగుళ్లు సైతం రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రి వేళల్లో ఈ రహదారిలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారిలో చీలికలు ఏర్పడడంతో అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి.


గ్రంధివేముల గ్రామం వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

**ఇబ్బందులు పడుతున్నాం**



మా ఊరి నుంచి నంద్యాలకు వెళ్లాలంటే చాలా సమయం పడుతోంది. కొన్ని చోట్ల అవసరం లేకున్నా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో కనిపించేలా రేడియం స్టికర్లు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో కొత్తవారు ప్రయాణించాలంటే నరకయాతనగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి సూచికలు ఏర్పాటు చేసి ప్రాణాలను కాపాడండి.

–చిన్న శాలుమియ్య, బూజునూరు గ్రామం

**అనవసరమైన స్పీడ్ బ్రేకర్లను తొలగించండి**



గడివేముల–నంద్యాలకు వెళ్లే రహదారిలో అనవసరంగా ఉన్న స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి. రోడ్డుపై అక్కడక్కడ ఏర్పడిన చీలికలను పూడ్చివేయాలి. ప్రజలకు, వాహనదాలకు ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో ప్రజలు పడే ఇబ్బందులు అనేకం. గ్రంధివేముల, చిందుకూరు, గడిగరేవుల గ్రామాల్లో స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. దీంతో పాటు రొడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు రోడ్డుపైకి రావడంతో ఇబ్బందులకు గురవుతున్నారు.

– గోదా ప్రసాద్, ఉపసర్పంచ్, గడిగరేవుల

## వాహనాలను అడ్డదిడ్డంగా నిలపరాదు

**కోడుమూరు రూరల్:** పట్టణంలో రోడ్లకు ఇరువైపులా ఎక్కడపడితే అక్కడ వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందని, వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లో రోడ్లపై వాహనాలను నిలపరాదని కోడుమూరు ఎస్ఐ బాల నరసింహులు సూచించారు. ఆదివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్, పాతబస్టాండ్, కోట్ల సర్కిల్ ప్రాంతాల్లో ఎస్ఐ తన సిబ్బందితో తిరుగుతూ వాహనదారులకు హెచ్చరికలు జారీ చేశారు. దుకాణదారులు తమ దుకాణాల ముందు రోడ్లపై కస్టమర్లు వాహనాలు నిలపకుండా చూసుకోవాలని, ఎవరైనా రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపితే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

**బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు**

బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ బాలనరసింహులు హెచ్చరించారు. ఆదివారం కోడుమూరు పరిసర ప్రాంతాల్లో ఆయన పర్యటించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు, కేసులు నమోదు చేశారు.


కోడుమూరులో వాహనదారులకు సూచనలిస్తున్న ఎస్ఐ బాలనరసింహులు

## అతిసార వ్యాధిపై అప్రమత్తత అవసరం

**ఓర్వకల్లు:** అతిసారా(డయేరియా)పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని మంజుల అన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. ప్రధానంగా కలుషిత నీటి వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుందని తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ వ్యాధి సోకిన వారిలో 3 కంటే ఎక్కువ సార్లు నీళ్లతో కూడిన విరేనాలైతే ఆలస్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒకవేళ వాంతులు, నీళ్ల విరేచనాలు అవుతున్నట్లయితే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తాగాలని పేర్కొన్నారు. ఇళ్లలో లభించే గంజి, పలుచని మజ్జిగ, పప్పునీరు, కొబ్బరినీరు వంటి ద్రావణాలను తాగాలని తెలిపారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణనష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

## కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

**కర్నూలు(సెంట్రల్):** సమాజంలోని ప్రతిఒక్కరూ కళ్ల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ సూచించారు. ఆదివారం లక్ష్మీనగర్‌లోని వికాస్ స్కూలులో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం, సిరి, శ్రీదత్త మహిళా ఐక్య సంఘాల నిర్వహణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ బి.స్వాతి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రసాద్ శర్మ మాట్లాడుతూ..సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో పేదల కోసం ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి రెండునెలలకొకసారి చివరి ఆదివారం బీపీ, షుగర్, మూర్ఛ వ్యాధులకు రూ.200కే రెండునెలలకు సరిపడ్డా మందులను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సుందరయ్య కేంద్రం నాయకులు జీఎస్ శేషయ్య, రంగస్వామి, ఎల్లాగౌడ్, శేషాద్రి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్ శర్మ

## కొత్తూరుకు పోటెత్తిన భక్తులు


స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు


నాగులకట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు

**పాణ్యం:** మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీవల్లి సుబ్రమణ్యేశ్వర స్వామి వారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం స్వామివారికి ప్రతీకరమైన రోజు కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. తెల్లవారుజామున నుంచే భక్తులు భారీగా తరలివచ్చి స్వామివారికి పూజలు చేశారు. ఉదయం 8 గంటలకే క్యూలైన్లు నిండిపోయాయి. స్వామివారి దర్శనం కోసం దాదాపు 4 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దాదాపు 350కి పైగా అభిషేకాలు జరిగాయని అధికారులు చెప్పారు. 8 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. ఈఓ రామకృష్ణ ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు.


స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు చేస్తున్న దృశ్యం


అన్నదానం స్వీకరిస్తున్న భక్తులు

### నేడు వైఎస్సార్ జయంతి

**సి.బెళగల్:** దివంగత మహానేత, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి ఉత్సవాలను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఓ ప్రకటనలో తెలియజేస్తూ.. సోమవారం ఉదయం 11 గంటలకు సి.బెళగల్‌లోని డాక్టర్ వైఎస్సార్ సర్కిల్‌లో నిర్వహించే జయంతి కార్యక్రమానికి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేతలు, కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఆదిమూలపు సతీష్ తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమానికి పార్టీ మండల నాయకులు, కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

### సద్వినియోగం చేసుకోండి

**సి.బెళగల్:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ అనుపమ సూచించారు. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, ప్రజలు వినియోగించుకోవాలని ఆమె అన్నారు. అదేవిధంగా కార్యక్రమానికి మండల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, హాజరుకాని అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదికలు పంపడం జరుగుతుందని తహసీల్దార్ తెలిపారు.

### దరఖాస్తు చేసుకోండి

**కోడుమూరు రూరల్:** కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ తెలుగు, ఇంగ్లిష్ మీడియం ఫస్టియర్, సెకండియర్‌లలో ప్రవేశాలకు పదో తరగతి పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల్లో చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా హాస్టల్ వసతిని కూడా కల్పిస్తోందని, అన్ని వర్గాల విద్యార్థులు అర్హులని, ఆసక్తి గల విద్యార్థులు సాధ్యమైనంత త్వరగా కళాశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకు అప్పగించాలి

**కర్నూలు(సెంట్రల్):** నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పగించేలా లోక్‌సభలో పోరాటం చేయాలని పీడీఎస్‌యూ నాయకులు కర్నూలు ఎంపీ బి.నాగరాజును కోరారు. ఆదివారం వారు ఎంపీని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం ఇచ్చారు. ప్రస్తుతం నీట్ పరీక్షను ఎన్‌టీఏ నిర్వహిస్తుండడంతో పేపర్ లీక్ అయి మెరిట్ విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మహేంద్ర పేర్కొన్నారు. నీట్ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించేలా పార్లమెంట్‌లో పోరాటం చేయాలని ఎంపీని కోరారు. నాయకులు రమణ, దశరథ్ నాయుడు, నరేంద్ర, తేజ, తిరుమలేష్, వెంకటేష్ పాల్గొన్నారు..

### వేగంగా బీరప్ప స్వామి దేవాలయ నిర్మాణం

**కర్నూలు(అర్బన్):** నగర శివారులోని పెద్దపాడు సమీపంలో ఆదర్శ పాఠశాల పక్కన దాతల సహకారంతో నిర్మిస్తున్న శ్రీ బీరప్ప స్వామి దేవాలయం పనులు వేగంగా జరుగుతున్నాయని జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు దాతలు అందించిన ఆర్థిక సహాయంతో గోపురం నిర్మాణం, అమీలియో హాస్పిటల్ అధినేత డా.ప్రసాద్ అందించిన ఆర్థిక సహాయంతో ప్రహరీగోడ నిర్మాణం పూర్తి చేశామన్నారు. గూడూరు మండలం కె. నాగలాపురం గ్రామానికి చెందిన సుంకన్న రూ.44 వేలు విరాళంగా అందించారన్నారు. ఇంకా చేపట్టాల్సిన పనులు చాలా ఉన్నాయని, దాతలు ముందుకు వచ్చి దేవాలయ నిర్మాణం పూర్తి అయ్యేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు, నాయకులు కొత్తపల్లె దేవేంద్ర, పెద్దపాడు పుల్లన్న, బీసీ తిరుపాలు, నగర అధ్యక్షుడు తవుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.


నేతలకు నగదును అందిస్తున్న సుంకన్న

# సిరుల పంట


గడివేముల మండలంలో సాగుచేసిన మొక్కజొన్న పంట

- మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్న రైతులు
- ఎకరాకు రూ.30 వేలకు పైగా ఆదాయం
- 110 రోజుల్లో పంట చేతికి..

**గడివేముల:** రైతులు ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న సాగుపై ఆసక్తి చూపుతున్నారు. గడివేముల మండలంలో మొత్తం 34,382 ఎకరాల వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఖరీఫ్‌లో 22,687 ఎకరాల్లో వివిధ పంటలు సాగుచేసే అవకాశం ఉంది. తక్కువ పెట్టుబడితో తొందరగా చేతికి వచ్చే పంటగా మొక్కజొన్నను రైతులు ఎంచుకుంటున్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి 25 వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు చెబుతున్నారు. ఎక్కువ శాతం రైతులు మొక్కజొన్న పైనే ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు రూ.25 వేల నుంచి 30 వేల ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంతో రైతులు పంట వేయడానికి ముందుకు వస్తున్నారు.

**మొక్కజొన్న సాగు పెరిగింది**

మండలంలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం మొక్కజొన్నపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో దాదాపు 8 వేల ఎకరాల వరకు సాగు చేసే అవకాశం ఉంది. అన్ని గ్రామాల్లోని వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

–హేమసుందర్‌రెడ్డి, ఏఓ, గడివేముల

## బాధిత కుటుంబాలకు పరామర్శ

**పాణ్యం:** మండల పరిధిలోని కొండజూటూరు గ్రామానికి చెందిన టోపి రాజమ్మ అనారోగ్యంతో కన్నుమూసింది. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సద్దల సూర్యనారాయణరెడ్డి, గ్రామ సర్పంచ్ సద్దల సుజిత్‌రెడ్డి ఆమె మృతికి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట పలువురు నాయకులు ఉన్నారు. అలాగే గడివేముల మండలం ఒండుట్ల గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు రవీంద్రారెడ్డిపై ఇటీవల దాడి జరిగిన విషయం తెలిసిందే. కర్నూలులోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్రారెడ్డిని వారు పరామర్శించారు.


బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు సద్దల సరళమ్మ

## విశ్రాంత ఉద్యోగులకు ఉచిత వైద్యశిబిరం

**కర్నూలు(హాస్పిటల్):** రిటైర్డ్ సీనియర్ సిటిజన్ సర్వీస్ సొసైటీ, కృష్ణానగర్ వారి ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులకు, సాధారణ ప్రజలకు ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కృష్ణానగర్‌లోని సొసైటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో కంటి చూపునకు సంబంధించిన పరీక్షలు డాక్టర్ జేజే.ప్రవీణ్ నిర్వహించారు. కంటి చూపునకు సంబంధించి ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సహాయ ఖజానాధికారి జి. రఘువీర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సొసైటీకి పి. హనుమంతరెడ్డి వాటర్ డిస్పెన్సర్‌ను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ గౌరవాధ్యక్షుడు జె.విశ్వేశ్వరయ్య, కార్యదర్శి సీవీ సుబ్బారావు, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.


కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ జె.జె.ప్రవీణ్